సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 22 । జూన్ । 2023



1 నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ

వచ్చేనెల ఒకటి నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలు జరుగుతుందని ఆర్‌జేడీ చిన్మయిదేవి తెలిపారు. 8లో



పశుబీమాతో ధీమా

మూగ జీవాల పెంపకందారులను ఆదుకునేందుకు ప్రభుత్వం వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకం అమలు చేస్తోంది. 9లో



విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పలు చోట్ల సత్కరించారు. 9లో

న్యూస్‌రీల్

ఈదురు గాలులకు రేకుల ఇల్లు ధ్వంసం

- రూ.2 లక్షల మేర ఆస్తినష్టం



గన్నేగుంటలో ఎగిరిపడిన పైకప్పు

జి.మాడుగుల: చింతపల్లి–జి.మాడుగుల మండలాల్లోని సరిహద్దు గ్రామాల్లో మంగళవారం ఈదురగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గిరిజన గ్రామాల మధ్య రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులకు రేకుల ఇల్లు ధ్వంసమైంది. చింతపల్లి మండలం కుడుముసార పంచాయతీ గన్నేగుంటలో ఇతంగి అర్జున్‌కు చెందిన ఇంటి రేకులు ఎగిరిపోయి ధ్వంసమైనట్టు గ్రామస్తులు తెలిపారు. బియ్యం ,ధాన్యం ఇతర సామగ్రి తడిచి ముద్దయ్యాయి. ఈదురు గాలులతో కూడిన వర్షానికి రేకుల ఇల్లు దెబ్బతినడంతో సుమారు రూ.2 లక్షల మేర ఆస్తినష్టం సంభవించిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం దెబ్బతిన్న ఇళ్లకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతుంది.

కొండ చరియలు పడకుండా రక్షణ చర్యలు



రైల్వేగేటు సమీపంలో గత ఏడాది జారిపడిన కొండ చరియలు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలు వెళ్లే మార్గం మధ్యలోగల రైల్వేగేటు వద్ద కొండచరియలు జారిపడకుండా రైల్వేశాఖ రక్షణ చర్యలు చేపట్టింది. గత ఏడాది అక్టోబర్ ఏడవ తేదీన వర్షాలకు కొండచరియలు జారిపడడంతో వాహనరాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆటోలు, ద్విచక్రవాహనాలు అతికష్టంగా ప్రయాణాలు సాగించాయి. బొర్రాగుహలను తిలకించేందుకు వచ్చిన పర్యాటకులు సైతం నిరాశతో వెనుదిరిగారు. వర్షాలు సమీపిస్తుండడంతో రైల్వేశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. కొండచరియలు జారిపడకుండా చేపట్టిన రక్షణ గోడల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.



కొండచరియలు జారిపడకుండా నిర్మించిన రక్షణగోడ

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విద్యార్థులతో లీడ్ బ్యాంక్ మేనేజర్ రవితేజ

సాక్షి,పాడేరు: జి–20 కార్యక్రమాల్లో భాగంగా రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆల్ ఇండియా స్కూల్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు లీడ్ బ్యాంకు మేనేజర్ రవితేజ తెలిపారు. మండల స్థాయిలో పలు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బుధవారం మెరిట్ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి 22 మండలాల పరిధిలో 142 పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. మండల స్థాయిలో మొదటి బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాలకు జమచేస్తామన్నారు. మండల స్థాయిలో విజేతలైన విద్యార్థులందరికి ఈనెల 28న జిల్లా కేంద్రమైన పాడేరులో క్విజ్ పోటీలు నిర్వహిస్తామని, జిల్లా స్థాయిలో విజేతలకు జూలైలో విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు జరుగుతాయన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ ప్రతినిధి జయంత్,పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతపల్లి రూరల్: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం భారతీయ రిజర్వు బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్టు యూనియన్ బ్యాంక్ మేనేజర్ నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి ఒక్క పాఠశాల నుంచి ఇద్దరు చొప్పున 8,9 తరగతుల విద్యార్థులకు ఆర్థిక సమీకృతం మరియు అభివృద్ధి విభాగంపై అవగాహన, క్విజ్ పోటీలు నిర్వహించామని తెలిపారు. వీటిలో ప్రతిభ కనబరిచిన వారికి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. ఎంఈవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పర్యాటకం

జిల్లాలో అరకు, లంబసింగి మాదిరిగానే మారేడుమిల్లి పరిసరాల్లోని పర్యాటక ప్రాంతాలకు మంచి ఆదరణ ఉంది. ఇక్కడికి కూడా పర్యాటక సీజన్‌లో సందర్శకులు భారీగా తరలి వస్తుంటారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపడాన్ని గుర్తించిన అటవీశాఖ ఆరోగ్య వంతమైన పర్యావరణ పర్యాటకంపై దృష్టి సారించింది. ప్లాస్టిక్ నిషేధం అమలుతో పర్యాటకులు ప్రకృతి అందాలను ఆస్వాదించేలా ఏర్పాట్లు చేస్తోంది.



పాములేరు వద్ద జంగిల్ స్టార్

- ప్రాధాన్యమిస్తున్న అటవీశాఖ
- రూ.60 లక్షలతో జంగిల్‌స్టార్, వనవిహారి అభివృద్ధి
- పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు
- మిషన్‌లైఫ్‌తో పర్యావరణ పర్యాటకంపై అవగాహన
- ప్రకృతి ఒడిలో సేదతీరేలా ఏర్పాట్లు



మారేడుమిల్లిలో ఆకట్టుకుంటున్న వన విహారి ముఖ ద్వారం

రంపచోడవరం : ఏజెన్సీలో పర్యాటక రంగానికి మంచి రోజులు వచ్చాయి. పర్యావరణ పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అటవీశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా పర్యాటక ప్రాంతాల్లో పూర్తిగా ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించే దిశగా అడుగులు వేస్తున్నారు. మారేడుమిల్లి అటవీప్రాంతానికి అరకు, లంబసింగి మాదిరిగా ఎక్కువ మంది పర్యాటకులు వస్తుంటారు. ఇప్పటికే అటవీశాఖ మారేడుమిల్లి, పాములేరు ప్రాంతాల్లో గిరిజనులతో కలిసి కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం పేరుతో పర్యాటక ప్రాజెక్టును నిర్వహిస్తోంది. మారేడుమిల్లి వనవిహారిలో పర్యాటకులకు అతిథి గృహాలు అందుబాటులో ఉన్నాయి. పాములేరు వాగును అనుకొని జంగిల్ స్టార్ క్యాంప్ రిసార్ట్స్ కూడా అందుబాటులో ఉంది. ఏపీ పర్యాటకశాఖ ఉడ్స్ పేరుతో త్రీస్టార్ వసతి కల్పిస్తోంది. వీటిని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.60 లక్షల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

సీజన్ నాటికి అందుబాటులోకి వచ్చేలా..

మారేడుమిల్లిలోని జంగిల్ స్టార్ క్యాంప్, వన విహారిలో శీతాకాలం నాటికి పర్యాటకులకు అవసరమైన స్థాయిలో వసతులు అందుబాటులోకి రానున్నాయి. దీనిలో భాగంగా క్యాంపెయిన్ టెంట్లు ఏర్పాటుచేస్తున్నారు. దీనికోసం జంగిల్ స్టార్‌లో ప్రత్యేకంగా కొంత ప్రాంతాన్ని కేటాయిస్తున్నారు. పెద్ద, చిన్న సైజుల్లో టెంట్లను అధికారులు సమకూరుస్తున్నారు. పర్యాటకుల ప్రకృతి ఒడిలో ఆహ్లాద వాతావరణంలో గడిపేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వన విహారిలో కూడా ఇదే తరహాలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ కూడా ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగంపై నిషేధం అమలుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా వన విహారి

మారేడుమిల్లిలో వనవిహారి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇక్కడ పర్యాటకుల సౌకర్యార్థం కాటేజీలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. వన విహారి ముఖద్వారాన్ని పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. వనవిహారి స్వాగత ద్వారం వద్ద ఏర్పాటు చేసిన గొర్రె గేదెల ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి.

మిషన్ లైఫ్‌తో అవగాహన



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ లైఫ్ పేరుతో రంపచోడవరం డివిజన్ పరిధిలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇప్పటివరకు 25 వేల అవగాహన సదస్సులు నిర్వహించాం. నీరు, అటవీ సంరక్షణపై అవగాహన కల్పించాం. ఏజెన్సీలో పర్యావరణ పర్యాటకం అభివృద్ధిపై దృష్టి సారించాం. వనవిహారి, జంగిల్ స్టార్ క్యాంప్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసింది. వీటితో త్వరలో పనులు చేపడతాం.

– నరేంధిరన్, డీఎఫ్‌వో, రంపచోడవరం

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం

జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్



సీతగుంటలో సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

పెదబయలు: అర్హతే ప్రామాణికంగా పథకాల మంజూరు జగనన్న సురక్ష లక్ష్యమని జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని సీకరి, సీతగుంట గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్హత ఉండి పథకాలు పొందని వారిని గుర్తించి వారి వివరాలను అప్‌లోడ్ చేయాలని గ్రామ సచివాలయ సిబ్బందికి సూచించారు. అర్హత ఉండి పథకాలు పొందని వారి వివరాలను ఇంటింటికీ వెళ్లి తెలుసుకోవాలని సూచించారు. గ్రామ సచివాలయ సిబ్బంది బృందాలుగా ఏర్పడి వలంటీర్లు, గృహసారథులు, ఇతర క్షేత్ర స్థాయి సిబ్బంది బృందంగా వెళ్లాలని ఆదేశించారు. కుల, నివాస, ఆదాయ ధ్రువపత్రాలు, మ్యుటేషన్లు, నివాస ధ్రువపత్రాల మంజూరుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణారావు, ఆర్‌ఐ సింహాచలం, సర్పంచ్ పలాసి మాధవరావు, గుల్లేలు కృష్ణారావు, ఎంపీటీసీ ఆనందరావు, రెవెన్యూ, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎకో టూరిజం హబ్‌ల అభివృద్ధికి చర్యలు



గబ్బంగిలో అటవీశాఖ తోటలను పరిశీలిస్తున్న చీఫ్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ మధుసూదనరెడ్డి

అటవీశాఖ చీఫ్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ మధుసూదనరెడ్డి



పాడేరు డివిజన్ అటవీశాఖ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న మధుసూదనరెడ్డి



మధుసూదనరెడ్డితో చర్చిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



చింతపల్లిలో మొక్కలు నాటుతున్న మధుసూదనరెడ్డి

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాలను ఎకో టూరిజం హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నామని అటవీశాఖ చీఫ్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ మధుసూదనరెడ్డి అన్నారు. బుధవారం ఆయన పాడేరు అటవీ డివిజన్ కార్యాలయం, రమణ నగర్‌లోని డీఎఫ్‌వో, ఇతర అధికారుల నివాస గృహాలు, గబ్బంగిలోని రెండు అటవీ ప్రాంతాల్లోని అటవీశాఖకు చెందిన తోటలు ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. గబ్బంగిలోని రెండు ప్రాంతాలు పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. వెంటనే వాటిని ఎకో టూరిజంలో పర్యాటక హబ్‌లుగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. కాటేజీలతో పాటు పూర్తిస్థాయిలో పర్యాటకులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసు కోవాలని సూచించారు. అలాగే పాడేరు అటవీశాఖ డివిజన్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. అటవీ అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా అటవీ అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతం చేయాలని, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా అందరూ పనిచేయాలని ఆదేశించారు. అనంతరం అటవీశాఖ అధికారులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. రమణనగర్‌లోని అటవీశాఖ అధికారులు, సిబ్బంది నివాస గృహాలను పరిశీలించారు. తమ నివాస గృహాల ప్రాంతాల్లో వారానికి ఓ సారి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విశాఖ అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ శ్రీకాంత్‌రెడ్డి, పాడేరు డీఎఫ్‌వో వినోద్‌కుమార్, రేంజ్ అధికారి శ్రీనివాసరావు, ఇతర అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్

పాడేరులో పర్యటించిన అటవీశాఖ చీఫ్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ మధుసూదనరెడ్డిని కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అటవీశాఖ అతిథి గృహంలో ఆయనను కలిసిన కలెక్టర్ జిల్లాలో అటవీ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం చీఫ్ కన్జర్వేటర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

చింతపల్లి: స్థానిక అటవీశాఖ డివిజన్ కార్యాలయాన్ని బుధవారం అటవీశాఖ చీఫ్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ మధుసూదనరెడ్డి సందర్శించారు. ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతపల్లి మండలంలో కృష్ణాపురం, పాడేరు మండలంలో అంజోడ్ అటవీ ప్రాంతంలో పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రత్యేక రిసార్ట్స్ నిర్మిస్తున్నట్టు తెలిపారు.చింతపల్లి డివిజన్ కార్యాలయ నూతన భవనం, బంగ్లా నిర్మాణానికి రూ.కోటి నిధులు కేటాయించినట్టు తెలిపారు. నర్సీపట్నం నుంచి డీఎఫ్‌వో కార్యలయం విడిపోవడం వల్ల ఉద్యోగుల సమస్య తలెత్తితందన్నారు. దీనిని పరిష్కరించేందుకు తాత్కాలిక నియామకాలు చేపడతామన్నారు. ఏజెన్సీలో రహదారుల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. రోడ్ల నిర్మాణానికి 36 దరఖాస్తులు వచ్చాయన్నారు. కృష్ణాపురం అడవుల్లో రిసార్ట్స్ నిర్మిస్తే పర్యాటకులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్‌వో శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి, చింతపల్లి పాడేరు డీఎఫ్‌వోలు సూర్యనారాయణ పడాల్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అపహరణకు గురైన శిశువు క్షేమం

- ఆస్పత్రిలో పసికందును పట్టుకుపోయిన గుర్తుతెలియని మహిళ
- వెంబడించడంతో గార్డెన్‌లో వదిలి వెళ్లిన అగంతకురాలు
- ఆస్పత్రిలో చేర్పించిన స్థానికులు
- వైద్యుల పర్యవేక్షణలో సంరక్షణ
- విచారణ చేపట్టిన సీడీపీవో నీలిమ
- తమ బిడ్డను అప్పగించాలని పోలీసులను ఆశ్రయించిన తండ్రి



రంగిలిసింగిలో స్థానికులతో మాట్లాడుతున్న సీడీపీవో నీలిమ




శిశువును కాపాడిన పాస్టర్ సతీమణి సుజాత

డుంబ్రిగుడ: ఆస్పత్రిలో అపహరణకు గురైన శిశువు వైద్యుల ఆధీనంలో క్షేమంగా ఉంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రంగిలిసింగి గ్రామానికి చెందిన పాంగి రామరాజు, గౌరి దంపతులకు రెండు వారాల క్రితం ఇంటివద్ద ఆడ శిశువు జన్మించింది. ఆమె ఆరోగ్యం బాగులేకపోవడంతో ఈనెల 15వ తేదీన అరకులోయ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు సూచన మేరకు వార్డులో చేర్పించారు. మరుసటి రోజు మధ్యాహ్నం శిశువు అమ్మమ్మను అని చెప్పి ఓ గుర్తు తెలియని మహిళ వార్డులోకి వెళ్లింది. ఆ సమయంలో తల్లిలేకపోవడంతో బెడ్‌పై ఉన్న శిశువును తీసుకుని బయటకు వెళ్లిపోయింది. దీనిని గమనించిన ఆస్పత్రి వద్ద ఉన్న వ్యక్తులు ఆమెను వెంబడించారు. అయినా పట్టుబడలేదు. శిశువును సమీపంలోని అగ్రికల్చర్ గార్డెన్‌లో వదిలి వెళ్లిపోయింది. తుప్పల్లో పడి ఉన్న శిశువును గమనించిన మహిళలు వెంటనే అక్కడి నుంచి తీసుకువెళ్లి స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న భార్యాభర్తలు మోస్య సుజాత, పాస్టర్ దేవదాసు (సల్మాన్)కు అప్పగించారు. వారు వెంటనే ఆస్పత్రికి తరలించి శిశువుకు అత్యవసర వైద్యం అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. అప్పటినుంచి శిశువు వైద్యుల ఆధీనంలో ఆస్పత్రిలోనే ఉంది. ఈ విషయం తెలుసుకున్న తండ్రి రామరాజు తమ శిశువును అప్పగించేలా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు, ఆస్పత్రి సిబ్బంది నుంచి అందిన సమచారం మేరకు శిశువుకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ విచారణ చేపట్టారు. శిశువు సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆమెను సంప్రదించారు. దీనిపై ఈనెల 22న అరకు సంతబయలులో పెద్దల సమక్షంలో విచారణ నిర్వహించి, ధ్రువీకరించిన తరువాత పూచీకత్తు రాయించి అప్పగిస్తామని సీడీపీవో బదులిచ్చారు.

మహిళ హత్య కేసులో ఐదుగురి అరెస్టు

వివరాలు వెల్లడించిన పాడేరు సీఐ సుధాకర్



మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు



విచారిస్తున్న సీఐ సుధాకర్, ఎస్‌ఐ లక్ష్మణరావు

పాడేరు రూరల్ : మండలంలోని వనుగుపల్లి పంచాయతీ తియ్యగెడ్డ గ్రామంలో హత్యకు గురైన మహిళ కేసును పోలీసులు మూడు రోజుల వ్యవధిలోనే ఛేదించారు. ఈ సంఘటనలో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పాడేరు సీఐ సుధాకర్ తెలిపారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జి.మాడుగుల మండలం కొరాపల్లి గ్రామానికి చెందిన కొర్రాబు బోడకొండమ్మ అలియాస్ గాయత్రిని అదే పంచాయతీ రూడిబయలు గ్రామానికి చెందిన పాంగి గణపతి అనే వ్యక్తి మూడో భార్యగా పెళ్లి చేసుకునేందుకు పాడేరు మండలం తియగెడ్డ గ్రామంలో తన పిన్ని ఇంటికి తీసుకువెళ్లాడు. బోడకొండమ్మ అనారోగ్యంతో మృత్యువాత పడిందని దహన సంస్కారాలు పూర్తి చేశామని బోడ కొండమ్మ తండ్రి కొర్రాబు త్రిమూర్తికి గణపతి తెలిపాడు. దీంతో అనుమానం వచ్చిన త్రిమూర్తి ఈ నెల 18న పాడేరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ లక్ష్మణరావు ఈ నెల 19న తియగెడ్డ గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని పాతి పెట్టిన ప్రదేశాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పాతి పెట్టిన చోట పైన కట్టెలతో కప్పినట్టు గుర్తించిన ఎస్‌ఐ లక్ష్మణరావు విషయాన్ని సీఐ సుధాకర్‌కు నివేదించారు. సీఐ సుధాకర్ పాడేరు తహసీల్దార్‌ను వెంటపెట్టుకొని సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలి మెడ చుట్టూ ఉరి వేసిన గుర్తులు ఉండడాన్ని చూసి హత్య కేసుగా నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా పలు విషయాలు వెలుగు చూసాయి. మొదటి నిందితుడు పాంగి గణపతికి గతంలోనే రెండు పెళ్లిళ్లు అయ్యాయి. మృతురాలిని మూడో భార్యగా చేసుకుంటానని చెప్పి ఒంగోలులో ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ ఆమెతో సహజీవనం చేశాడు. మృతురాలు గణపతిని తన తల్లిదండ్రుల ఇంటికి తీసుకువెళ్లమని చెప్పడంతో ఈ నెల 14న తియగెడ్డ గ్రామంలో గల తన పిన్ని ఇంటికి తీసుకువచ్చాడు. అక్కడ కూడా ఉండడానికి ఇష్టపడని బోడకొండమ్మ తాను కొరాపల్లిలో తన తల్లిదండ్రుల వద్దకు వెళ్తానని చెప్పింది. అయితే ఆమె ఎక్కడికీ వెళ్లడానికి వీలు లేదని, తనతో ఉండకపోతే చంపేస్తానని గణపతి బెదిరించాడు. అతని మాట వినని బోడకొండమ్మ ఈ నెల 16న ఉదయం 7గంటలకు కొరాపల్లి గ్రామానికి వెళ్లేందుకు సిద్ధపడుతూ ఉండగా ఆమెను చున్నీతో మెడ చుట్టూ గట్టిగా లాగి హత్య చేశాడు. అనంతరం విషయాన్ని తన కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారి సహకారంతో మృతదేహాన్ని గ్రామ శివారులో పాతి పెట్టి సాక్ష్యాలు లేకుండా ప్రయత్నం చేశాడు. ఈ సంఘటనలో రూడిబయలు గ్రామానికి చెందిన పాంగి గణపతి, అతనికి సహకరించిన అదే గ్రామానికి చెందిన పాంగి శోభన్, పాంగి మహేష్‌బాబు, పాంగి లక్ష్మమ్మ, పాంగి భారతిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఊరూరా ఆనంద యోగం



పాడేరులో యోగా బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



పాడేరు డిగ్రీ కళాశాలలో యోగా చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సాక్షి,పాడేరు: ప్రపంచ యోగా దినోత్సవాన్ని బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ వనుము చిట్టిబ్బాయి ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. సూర్య నమస్కారాల ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రసూల్, అధ్యాపకులు పి.కోటేశ్వరరావు, అశ్విని‌రెడ్డి, చంద్రకళ, అనిత, విజయలక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు రమేష్, గౌరీశంకరరావు పాల్గొన్నారు.

అరకులోయ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల,మహిళా డిగ్రీ కళాశాలల్లో ప్రపంచ యోగా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాళ్లు భరత్‌కుమార్‌నాయక్, రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులంతా సూర్యనమస్కారాలు, పలు యోగాసనాలు చేశారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మి, అన్ని విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.అలాగే స్థానిక ప్రథమశ్రేణి మెజిస్టీరియల్ కోర్టులో సిబ్బంది యోగా దినోత్సవం నిర్వహించారు.

యోగాతో మానసిక ప్రశాంతత

పెదబయలు: యోగా నిత్య జీవితంలో భాగంగా చేసుకోవడం వల్ల ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని పెదబయలు సీఆర్‌పీఎఫ్/198 బెటాలియన్ కమాండెంట్ పి.చర్యజ్‌రాజ్ అన్నారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో యోగా డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా యోగాను ఎవరైనా సాధన చేయవచ్చన్నారు. ఆరోగ్యవంతంగా ఉండాలంటే యోగా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. పెదబయలు ఎస్టీ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల,ఇతర పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కల్పించారు.

పాడేరు రూరల్: యోగాపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పి.అభిషేక్ సూచించారు. బుధవారం యోగా డే సందర్భంగా ఆరోగ్య శాఖ అధికారులు రూపొందించిన బ్యానర్లను ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సంక్షేమం కోసం 'ఒకే ప్రపంచం ఒకే కుటుంబం' అనే యోగాను స్వీకరించడానికి యోగా జరుపుకుంటున్నామని చెప్పారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ.కొండలరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు



అరకు: యోగా చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఒకటి నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ

ఆర్‌జేడీ చిన్మయిదేవి



కులబీరులో నాడు నేడు పనులను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

ముంచంగిపుట్టు: వచ్చేనెల ఒకటో తేదీ నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలు జరుగుతుందని మహిళా శిశుసంక్షేమశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు.అంగన్‌వాడీ కార్యకర్తలు,ప్రాజెక్టు సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అమలు తీరు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న ఆహారం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ఆరా తీశారు.అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ప్రతినెలా 25 రోజులకు సరిపోయే బియ్యం, కందిపప్పు, వంటనూనె, బెల్లం, ఎండు ఖర్జూరంతో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తామని తెలిపారు. 15 రోజులకు ఒకసారి 12 కోడిగుడ్లు, పాలు కూడా ఇంటికి వద్దకే అందిస్తామని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో 10,504 మంది గర్భిణులకు11,319 మంది బాలింతల ఇంటికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ సరకులు అందిస్తామని ఆమె పేర్కొన్నారు.

సకాలంలో నాడు–నేడు పనులు పూర్తి

మండలంలోని జర్జుల పంచాయతీ కేంద్రంతో పాటు కులబీరు గ్రామంలో నాడు–నేడు పథకంలో జరుగుతున్న అంగన్‌వాడీ కేంద్ర భవనాల పనులను ఆర్‌జేడీ చిన్మయిదేవి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. నాడు–నేడు పథకంలో విశాఖ జోన్ పరిధిలో 396 అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు మంజూరయ్యాయని, పనులు జరుగుతున్నాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పనపై ప్రత్యేక యాప్‌ను రూపొందించామని ఆమె పేర్కొన్నారు. జిల్లా పీడీ సూర్యలక్ష్మి, సీడీపీవో వరహాలమ్మ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దారిదోపిడీ కేసులో నిందితుల పట్టివేత

- 9 మందికి 14 రోజుల రిమాండ్
- పరారీలో ఒకరు
- కేసును ఛేదించిన గ్రామీణ పోలీసులు
- డీఎస్పీ, సీఐ, పోలీసు సిబ్బందిని అభినందించిన అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ



డీఎస్పీ సుబ్బరాజుకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ సత్యనారాయణరావు

అనకాపల్లిటౌన్: దారి దోపిడికి పాల్పడిన 10మంది వ్యక్తులపై కేసు నమోదు చేయగా ఒక వ్యక్తి పరారీలో ఉన్నట్లు అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడారు. విశాఖ పూర్ణామార్కెట్ వేలంపేటకు చెందిన ముప్పిడి మహేష్, తండ్రి రాంబాబులు వృత్తిరీత్యా బట్టలవ్యాపారం చేస్తారని ఆయన చెప్పారు. ఈనెల 19న వేలంపేట నుంచి అల్లూరి సీతారామరాజుజిల్లా పెదబయలులో జరిగే వారపుసంతలో బట్టలు విక్రయించేందుకు మహేష్ వ్యాన్‌లో తండ్రి రాంబాబు, వర్కర్ సతీష్, వ్యాన్‌డ్రైవర్ నాగరాజులు కలిసి వెళ్లినట్లు తెలిపారు. అక్కడ వ్యాపారం ముగించుకొని అదేరోజు సాయంత్రం 3.30 నిమిషాలకు పెదబయలు నుంచి అనకాపల్లి మీదుగా విశాఖ వెళ్లేందుకు నిర్ణయించుకున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. పాడేరు దాటిన తర్వాత అనకాపల్లి గవరపాలేనికి చెందిన యల్లపు నూకేష్, మొల్లేటి లోకేష్‌లు ద్విచక్రవాహనంపై రాంబాబు వ్యాన్‌ను వెంబడించినట్లు తెలిపారు. వెంకన్నపాలెం కూడలి దాటే సమయంలో మరోమూడు ద్విచక్ర వాహనాలపై మొత్తం 10 మంది వ్యాన్ వెనుకవచ్చారని చెప్పారు. అనకాపల్లి మండలం బవులవాడ గ్రామానికి రాత్రి 7.15 నిమిషాలకు చేరుకున్న సమయంలో 10 మంది వ్యాన్‌ను ముందు బైక్‌లతో నిలిపివేశారని చెప్పారు. వ్యాన్‌లో నలుగురిని కిందికి దించి గంజాయి ఏమైనా రావాణా చేస్తున్నారా అంటూ ప్రశ్నించి వ్యాన్‌ను దౌర్యన్యంగా తనిఖీ చేసినట్లు ఆయన చెప్పారు. పట్టణంలో గవరపాలేనికి చెందిన కొణతాల దివాకర్ వ్యాన్ నాగరాజును పక్కకు జరిపి దివాకర్ డ్రైవింగ్ చేస్తూ నలుగురితో అనకాపల్లి డైట్ కళాశాలకు ఎదురుగా ఉన్న నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతంలో వ్యాన్‌ను నిలిపివేసినట్లు ఎస్పీ చెప్పారు. మిగిలిన తొమ్మిది మంది వ్యాన్ ఫాలో అవుతూ వచ్చి వ్యాన్ నుంచి బట్టలు, వ్యాపారులు రాంబాబు, మహేష్, సతీష్, నాగరాజుల నుంచి రూ.20 వేలు నగదు అపహరించి పదిమంది పరారైనట్లు ఎస్పీ చెప్పారు. ఈ మేరకు మంగళవారం రాత్రి మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. గవరపాలేనికి చెందిన యల్లపు నూకేష్, మొల్లేటి లోకేష్, కర్రి పూర్ణదర్శిక్, దామరౌతు మోహన్, శరగడం మహేంద్రకుమార్, పాలమరశెట్టి లోకేష్, నర్సీపట్నానికి చెందిన నీలంపేట గ్రామానికి చెందిన వీశంశెట్టి భరద్వాజ్, స్థానిక నెయ్యిలవీధికి చెందిన దుప్పాడ అనిల్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్పీ చెప్పారు. స్థానిక విజయరామరాజుపేటకు ఏఎంసీ కాలనీకి చెందిన ఎర్రంశెట్టి వంశీ పరారీ ఉన్నాడని, త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని ఎస్పీ చెప్పారు. నిందితుల నుంచి మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. 24 గంటల్లో కేసును ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్న డీఎస్పీ సుబ్బరాజు, రూరల్ సీఐ రవికుమార్, పోలీసు సిబ్బందిని ఎస్పీ మురళీకృష్ణ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ క్రైం ఎస్పీ సి.సత్యనారాయణరావు ఉన్నారు.

డిజిటల్ తరగతి గదులు సిద్ధం చేయండి

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: నాడు–నేడులో మొదట విడత పనులు పూర్తి చేసిన పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులను వెంటనే సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో విద్య, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్, డీఆర్‌డీఏ అధికారులు, ఎంపీడీవోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపిక చేసిన పాఠశాలలకు స్మార్ట్ టీవీలు, ఉన్నత పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. ఇంటర్నెట్ కనెక్టివిటి, ఎలక్ట్రికల్ పనులను హెచ్ఎంలు బాధ్యతగా తీసుకుని పూర్తి చేయాలని సూచించారు. జగనన్న విద్యాకానుక కిట్లు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు పంపిణీ చేసిన బూట్లలో హెచ్చు తగ్గులు ఉంటే వెంటనే యాప్‌లో అప్‌లోడ్ చేసి, రిప్లేస్‌మెంట్ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు యూనిఫాం కుట్టించేందుకు మండలాల వారీగా టైలర్లను గుర్తించి, సకాలంలో విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు. జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీలో అలసత్వం వహించే హెచ్ఎంలను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నాడు–నేడు పనులలో నాణ్యత పాటించాలని, పనులన్ని వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.మేజర్ అండ్ మైనర్ మరమ్మతులు వచ్చేనెల 10వతేదీ నాటికి, విద్యుత్ పనులు జూలై 15కు, టాయిలెట్ల పనులు జూలై 20కు, తాగునీరు పనులు జూలై 25 నాటికి పూర్తి చేసే లక్ష్యంతో అందరూ పనిచేయాలని సూచించారు. ఎంపీడీవోలు తరచూ సమీక్షలు నిర్వహించి పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఈవో సలీంబాషా, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు,డీఆర్‌డీఏ పీడీ మురళీ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలకు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్: వైద్య ఆరోగ్య శాఖ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు విజయవంతం చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. ఆయన కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ, గిరిజన సంక్షేమశాఖ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25, 26వ తేదీల్లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి స్థానిక ఏపీఆర్‌జేసీలో ఏర్పాటు చేస్తున్న సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ప్రారంభించే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. 700 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేందుకు 13 గదులను, ప్రజల కోసం మరో మూడు గదులను ఏర్పాటు చేయాలని సూచించారు. సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడే వారికి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తుందన్నారు. అంతకుముందు స్థానిక ఏపిఆర్ కళాశాలను పరిశీలించి, ఏర్పాట్లును పర్యవేక్షించారు. అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు పివో అదేశించారు. గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, డీఎంహెచ్‌వో జమాల్ భాషా, జిల్లా ఆసుపత్రి సూపరింటిండెంట్ కృష్ణారావు, ఏటీడబ్ల్యూవో రజని, కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా నిర్మూలనకు చర్యలు

అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్ : జిల్లాలో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగిందని అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. తన కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ 35 గంజాయి కేసులు నమోదు చేసి 80 మందిని అదుపులోకి తీసుకొని 885.62.5కేజీల స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. గంజాయి విలువ రూ.17లక్షల 51వేల 800 ఉంటుందని చెప్పారు. 13 వాహనాలను, 55 సెల్‌ఫోన్ల, రూ.40,800 నగదు స్వాధీనపరుచుకున్నామని తెలిపారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు వి.మాడుగుల మండలంలో తాటిపర్తి గ్రామం, చీడికాడ మండలంలో కోనాం గ్రామం, నర్సీపట్నం రూరల్లో డౌనూరు గ్రామం, కేడీ పేటలో భీమవరం గ్రామం వద్ద మొత్తం 4 అనుమతి గల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, అదనంగా మరో 11 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, వివిధ ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేయనున్నామన్నారు. ఒక వ్యక్తిపై పీడీ కేసు నమోదు చేశామన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు 138 కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు 17 ప్రధాన కూడళ్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలు

మహారాణిపేట (విశాఖ): వైద్య ఆరోగ్య శాఖలో ప్రాంతీయ స్థాయిలో బుధవారం పలువురికి బదిలీలు జరిగాయి. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు కేటగిరీల్లో సీనియర్ అసిస్టెంట్లు 62 మందికి బదిలీలు చేశారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా, విశాఖపట్నం జిల్లా, ఏఎస్ఆర్ జిల్లాల్లో సీనియర్ అసిస్టెంట్లకు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ పి.ఉమాసుందరి ఆధ్వర్యంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్ బదిలీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఒక ఉద్యోగ సంఘం నాయకులు కోర్టు ఆర్డర్ తీసుకొచ్చి బదిలీలు చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ పి.ఉమాసుందరి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్‌కు అందజేశారు. అయితే అప్పటికే బదిలీల వ్యవహారం పూర్తి అయిపోవడంతో తాము ఏమీ చేయలేమని ఉద్యోగ సంఘం నాయకులకు అధికారులు తెలియజేశారు. దీంతో ఉద్యోగ సంఘం నాయకులు అక్కడ నిరసన తెలిపారు.

వైద్య ఆరోగ్యశాఖలో ఉమ్మడి విశాఖ జిల్లాలో కూడా ఉద్యోగుల బదిలీలు బుధవారం జరిగాయి. విశాఖపట్నం, అనకాపల్లి, ఏఎస్ఆర్ జిల్లాల్లో పలు కేటగిరీల్లో మొత్తం 53 మందిని బదిలీ చేసినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. 11 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, ఏడుగురు ఎల్‌డీ కంప్యూటర్ ఆపరేటర్లు, 15 మంది అటెండర్లు, ఐదుగురు స్వీపర్లు, ఒక టైపిస్టుకు బదిలీ చేశారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు



కించుమండలో దుకాణాలను పరిశీలిస్తున్న కార్మికశాఖ జిల్లా ఇన్‌చార్జి సుజాత

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ వారపు సంతలో బుధవారం జిల్లా కార్మికశాఖ ఇన్‌చార్జి అధికారి సుజాత పర్యటించి దుకాణాలను పరిశీలించారు. ఓ దుకాణంలోని బాల కార్మికుడిని గుర్తించారు. యాజమానిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల కార్మికులతో పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్మికశాఖ అధికారి సూర్యనారాయణ పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనాలు

ఎస్.రాయవరం : గుర్రాజుపేట సమీపంలో రేవుపోలవరం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఎస్.రాయవరం పోలీసులు అందించిన వివరాలివి. ఎస్.రాయవరం మండలం పెదఉప్పలం గ్రామానికి చెందిన అడబాల నవీన్ అడ్డురోడ్డు నుంచి పెద ఉప్పలం వెళుతుండగా కొయ్యూరు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఎ. విశాల్ ఎదురుగా బైకుపై వస్తూ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉందని చెబుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రసాద్‌రావు తెలిపారు.

25న ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్షకు ఏర్పాట్లు

విశాఖ విద్య: యూపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 25న నిర్వహించే ఇంజనీరింగ్ సర్వీసెస్ మెయిన్ పరీక్షకు పక్కా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇంజనీరింగ్ సర్వీసెస్ మెయిన్ పరీక్షకు జిల్లాలో 73 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. నగరంలోని ఏవీఎన్ కాలేజీలో పరీక్ష కేంద్రం ఏర్పాట్లు చేశామన్నారు. యూపీఎస్సీ నిబంధనలకు అనుగుణంగా పరీక్ష నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో విద్యుత్, ఆర్టీసీ, జీవీఎంసీ, పోలీస్, రెవెన్యూ, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల డిగ్రీలో విద్యార్థికి సంపూర్ణ స్వేచ్ఛ



మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

ఏయూ క్యాంపస్: నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సుల్లో విద్యార్థికి సంపూర్ణ స్వేచ్ఛ ఉంటుందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నాలుగు సంవత్సరాల డిగ్రీ విద్యా విధానంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యూజీసీ కూడా ప్రస్తుతం సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానం అమలు చేయాలని భావిస్తోందన్నారు. విద్యార్థి డిగ్రీ కోర్సులో చేరిన సమయంలో మేజర్ సబ్జెక్టును మాత్రమే ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రెండో సెమిస్టర్‌లో విద్యార్థి ఆసక్తికి అనుగుణంగా మైనర్ సబ్జెక్టును ఎంపిక చేసుకునే స్వేచ్ఛ, వెసులుబాటు ఉంటాయని చెప్పారు. విద్యార్థికి ప్రాధాన్యం కల్పిస్తూ రాష్ట్రంలో విద్యా విధానం ఉంటుందన్నారు. 26 ఏళ్ల కిందట రాష్ట్రంలో సింగిల్ మేజర్ విధానం అమల్లో ఉండేదని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థిని నైపుణ్యాలతో సుసంపన్నం చేసి మానవ వనరులుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భావిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేశామన్నారు. నాలుగేళ్ల డిగ్రీ విద్యా విధానంపై కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు అపోహలు వీడాలని సూచించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో సూచించిన మార్పులను ప్రభుత్వం వెంటనే యథాతథంగా అమలు చేసిన తీరును వివరించారు. విద్య ప్రతి కుటుంబానికి వెలుగునిస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసిస్తున్నారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, సీడీసీ డీన్ ఆచార్య సత్యనారాయణరెడ్డి, విద్యార్థులు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు, రేపు పలు రైళ్ల రద్దు



తాటిచెట్లపాలెం: ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి సహకరించాలని కోరారు. ఈ నెల 22న ఖరగ్‌పూర్–విల్లుపురం(22603) ఎక్స్‌ప్రెస్, షాలిమార్–హైదరాబాద్(18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–షాలిమార్ (18046) ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–డిఘా(22874) వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–మంగుళూరు (22851) వివేక్ ఎక్స్‌ప్రెస్, డిబ్రూఘడ్–సికింద్రాబాద్ (07047) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. ఈ నెల 23న డిఘా–విశాఖపట్నం (22873) వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, శ్రీ సత్య సాయి ప్రశాంతి నిలయం–హౌరా(22832) ఎక్స్‌ప్రెస్ రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

హౌరా మెయిల్ రీ షెడ్యూల్

బుధవారం రాత్రి 7.20 గంటలకు చెన్నైలో బయలుదేరాల్సిన చెన్నై సెంట్రల్– హౌరా (12840) మెయిల్ ఎక్స్‌ప్రెస్ సుమారు మూడున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 11 గంటలకు బయలుదేరింది.

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు

కొమ్మాది(భీమిలి): జవహర్ నవోదయ విద్యాలయలో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం గత ఏప్రిల్ నెలలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ కె.సంజయ్ తెలిపారు. అభ్యర్థులు నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ నుంచి https:// cbscit. in/ cbse/2023/ nvsresult/ Result. aspx

లింక్ ద్వారా రిజిస్టర్డ్ నంబర్, పుట్టిన తేదీని నమోదు చేసుకుని ఫలితాలు పొందవచ్చని తెలియజేశారు.

ఆర్టీసీ దూరప్రాంత సర్వీసులకు రాయితీ

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): ఏపీఎస్ ఆర్టీసీ దూర ప్రాంత సర్వీసుల్లో రానుపోను టికెట్ ముందుగా రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు టికెట్ చార్జీలో 10 శాతం రాయితీ పొందే సదుపాయం కల్పిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు ప్రకటనలో పేర్కొన్నారు. www.apsrtconline.in ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చని, లేదా ద్వారకా బస్‌స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ ద్వారా కూడా రానుపోను టికెట్ రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

దివ్యాంగులకు అండగా



దివ్యాంగురాలికి వాహనం అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, చిత్రంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి(ఫైల్)



వాహనాల పంపిణీకి హాజరైన దివ్యాంగులు(ఫైల్)

- మూడు చక్రాల మోటార్ వాహనాల పంపిణీ
- ఒక్కో వాహనం విలువ రూ.లక్షా 20 వేలు

తుమ్మపాల : దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు ప్రస్తుతం ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తోంది. అంగవైకల్యంతో బాధపడుతున్న వారికి ఇటు ఉద్యోగ కల్పన, అటు రుణ సౌకర్యం అందిస్తూ వారి కాళ్ల మీద వారు నిలిచేలా ఎప్పటికప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించడంలో వారి వ్యయప్రయాసలకు చెక్ పెట్టే చర్యలు చేపట్టింది. ఇందుకోసం దివ్యాంగ సంక్షేమ శాఖ ద్వారా వారికి మూడుచక్రాల మోటారు సైకిళ్లు అందిస్తోంది.

వాహనం విలువ రూ.1.20 లక్షలు

జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో ఉన్న దివ్యాంగులకు మూడుచక్రాల మోటారు సైకిళ్ల కోసం దరఖాస్తులను స్వీకరించింది. రూ.లక్షా 20 వేల విలువ చేసే మూడు చక్రాల మోటారు వాహనాలను అందించేందుకు సంక్షేమ శాఖకు ఆదేశాలిచ్చింది. నియోజకవర్గానికి 10 వాహనాల చొప్పున ఎంపిక చేశారు. జిల్లాలో అనకాపల్లిలో ఈ నెల 17న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్లమెంట్ సభ్యురాలు భీశెట్టి వెంకట సత్యవతిల చేతుల మీదుగా తొలి విడత పంపిణీ జరిగింది. అనకాపల్లి, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన 20 మంది దివ్యాంగులకు మోటారు సైకిళ్లను అందించారు. మరో 50 వాహనాలను జూలై నెలలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల చేతుల మీదుగా దివ్యాంగులకు పంపిణీ చేసేందుకు సంక్షేమ శాఖ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

వాహనాల కోసం 149 దరఖాస్తులు

జిల్లాలో 149 మంది దివ్యాంగులు వాహనాల కోసం దివ్యాంగ సంక్షేమశాఖకు దరఖాస్తులు చేసుకున్నారు. 96 దరఖాస్తులను సదరు శాఖ ఎంపిక చేసింది. ప్రస్తుతానికి 70 వాహనాల పంపిణీకి ఏర్పాట్లు చేసింది. వీటిలో ఇప్పటికే 20 వాహనాలను అందించారు. మరో 50 వాహనాలు అందించాల్సి ఉంది.

చాలా ఆనందంగా ఉంది



వాహనం మంజూరు కావడంతో చాలా ఆనందంగా ఉంది. గతంలో ఎక్కడికైనా వెళ్లాలంటే మరొకరి సహాయం అవసరమయ్యేది. ఇప్పుడు నా అంతట నేనుగా బయటకెళ్లి పనులు చక్కబెట్టుకుంటున్నా. అనకాపల్లి కలెక్టరేట్‌లో వాహనం కోసం దరఖాస్తు చేసుకున్నా. సంక్షేమ శాఖ ఇటీవల నాకు వాహనం మంజూరు చేసింది.

– పెంట సన్యాసి, దివ్యాంగుడు, అనకాపల్లి

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అర్హులైన దివ్యాంగులకు సీఎం జగన్ ప్రభుత్వం మూడు చక్రాల మోటారు సైకిల్‌ను ఉచితంగా అందిస్తోంది. జిల్లాలో 96 దరఖాస్తులు తుది పరిశీలనలో ఎంపికయ్యాయి. తొలి విడతలో 70 వాహనాలను పంపిణీ చేస్తున్నాం. ఇప్పటికే 20 అందించాం. మిగిలిన 50 వాహనాలు వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు చేశాం.

– బి.వి.జగదీష్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖాధికారి